# పాకి

మాగిపొద్దు నడినెత్తిమీదికచ్చింది...

ఎండ కరకర మంటంది...

ఈశ్వరయ్య హోండామీద మ్యాతరి లింగని ఇంటికి మల్లా వచ్చిండు. ఎండకు చెమటలు కారుతున్నయ్...

బండి దిగుకుంట... 'మబ్బిడిసిన ఎండ... మొగన్నిడిసిన ముండ...

తేజుగుంటయంటరు' అని గులుకున్నడు. పగటిపూట బడికిపోవుటానికి సైకిల్ తుడుసుకుంటున్న రమేషు 'మా అయ్యలేడు పటేలా.... వూరికి పోయిండు' అని చెప్పిండు. వాడు పదో తరగతి చదువుకుంటండు.

"ఏందిరో... వారం రోజుల్నుంచి తిప్పిచ్చుకుంటండు... గిదేనార మర్యాద... ఇయ్యాల్ల వస్తనన్నడు. చూసి చూసి వత్తిని... రెండు బస్తాల దొడ్డుప్పు, మూడు బస్తాల బొగ్గులు రెడీగ పెట్టిన... రాంగనే రమ్మని చెప్పు "కులం పని ఇడిసిపెట్టి సుకూన్‌గ బతుకుతుండ్రు బిడ్డా..." కోపంగనే బండి స్టార్ట్ చేసుకొని పోయిండు.

ఇంట్లకెల్లి లింగడు గప్పుడే బయటికచ్చిండు...

"పటేలు మర్లిపోతుండేంద్రా... ఏం జెప్పినవ్" అన్నడు తీగురంగ...

"నువ్వు వూరికి పోయినవని చెప్పిన..."

"గట్లెందుకు చెప్పినవ్‌రా... యాభై రూపాయలు బయాన కూడా ఇచ్చిండు. గిప్పుడు మాట తప్పితే మంచిగుంటదా... ఇప్పటికే నాలుగుసార్లు నడిసిండు" అన్నడు.

"బయాన వాపసిచ్చేయ్... నువ్వు ఆల్ల పాయఖాన ఎత్తిపోస్తె... నేనింట్లకెల్లి ఎల్లిపోత...." అనుకుంట సైకిల్ తీసుకొని కోపంగ ఎల్లిపోయిండు.

లింగనికి మనసంత కలికలి అయింది.

మాట తప్పినట్లయితదేమోనని బెంగ పట్టుకున్నది... పటేలు ఏం తిడ్తడోనని భయం పట్టుకున్నది.

"రమేష్ గాడు జిద్దుమనిషి. మ్యాతరి కులంల పుట్టినా వానికి ఈ పనంటె రోత... అయ్యని కూడా సూడకుంట గంజిల ఈగను తీసేసినట్టు తీసేత్తడు... పాకి బతుకులోల్లం గిదేపని జేత్తంరా అంటే ఇనడు... అయినా మలాన్ని ఎత్తిపోసుడు ఇప్పుడెక్కడున్నది. ఎనుకట కొందరు మారాజుల ఇండ్లల్ల గద్దె పాయికాన్లుండేటియ్... చీపురు, రేకు, బకీటు పట్టుకొని రోజు మలాన్ని బకెట్లల్ల ఎత్తుకచ్చి ఊరవతల పారవోసేది. మ్యాతరి కుటుంబాలు పది పన్నెండు వుండేటియి.... రాన్రాను సిమెంటు గాజుల్తోని బాయిలు తవ్విచ్చుకొని మీద బిల్లేసుకొని పాయికానాలు కట్టుకున్నరు. దాంతోని మ్యాతరోల్లకు పని లేకుండా పోయింది. వేరే పనులు చూసుకుంట తాల్లు తంగెల్లు పట్టినట్టు చిల్లంగత్రం అయింద్రు.

రమేషుగాడు ఆరో తరగతికచ్చినంక ఓనాడు వాళ్లమ్మ చెప్పింది...

కులం గురించి... కులపోల్లు చేసే పని గురించి... చీపురు బకెట్ పట్టుకొని పోయేది... నిన్ను ఎడమ సంకలేసుకునేది... కుడి భుజానికి బాకెట్ తగిలిచ్చుకునేది... అని చెప్పింది.

వాడు తిన్నదంత కక్కుకున్నడు... అవుమానంతోని కుంగిపోయిండు... దుఃఖం తడతడ ఎత్తేసుకచ్చింది.

ఒకప్పుడు వాళ్లమ్మ పాకి పనికిపోయేటప్పుడు వేసుకునే పైజామా డ్రెస్సులు తీసి కాలవెట్టిండు. పుల్లల చీపుర్లు ఇరుగొట్టిండు... సూరుకు చెక్కిన రేకులు తీసి ఇసిరేసిండు... ఇనుప బకిట్లను బండలెత్తేసి పాడు చేసిండు. ఇల్లంత గాయిగాయి చేసిండు. రెండు గంటలు ఏడ్సిండు...ఊకుంచ తరంగాలె...

'ఇప్పుడు ఆపని చేత్తలేం బిడ్డా... అన్ని గాజుల పాయిఖాన్లయినయ్... ఆ బాయి నిండితే పిలుస్తరు.. దొడ్డుప్పు బొగ్గులు కలిపి ఆ బాయిల పోస్తం... నాలుగైదు

రోజులకల్లా మలమంతా మట్టిలెక్కయితది. ఇద్దరు ముగ్గురం కల్సి ఆమట్టినెత్తి పారవోస్తం... ఆ ఎరువునమ్ముకుంటే కూడా వంద రూపాయిల దాకా దొరుకతయ్... అని చెప్పిండ్రు.

అయినా రమేష్‌గాడు విన్లేదు.

ఏదైనా ఏరిగింది ఎత్తిపారవోసుడే... ఈసారి ఎత్తి పారవోసుటానికి పోతే... ఇంట్లకెల్లి పారిపోత... అని అప్పటికెల్లి బెదిరిత్తండు.

వాడు పూర్లె లేనప్పుడు అయిదారు పాయిఖాన్లు ఎత్తిపారవోసిండు... కని ఇప్పుడెట్ల...?? లింగని మనసంత జెర్రికి చీమలు పట్టినట్లయింది. బర్కతి లేని బతుకుల గురించి ఆనికెట్ల జెప్పాలె... యమశెరల వడ్డట్టు గావట్టె... ఆన్ని మత్పరిచ్చి పోయెటట్టు లేకపాయె... అని మనుసంత సెంచరిల్లుకుంట కూసున్నడు...

గుల్లకోట కాడ చెల్లెలు ఋక్కవ్వ... కొడుకు పుట్టెంటికలు పెట్టుకున్నది. మాసమెత్తన్న పెట్టకపోతె ఏం మంచిగుంటది... అయిదు నూర్లన్న చేతిలపెట్టకపోతె ఎట్లుంటది. అని మనాది షురువైంది...

ఈశ్వరయ్య పటేలు 'పాయిఖాన నిండిందిరా లింగా... నువ్వే ఎత్తిపారవొయ్యాలె... లేకపోతె గోస అయెటట్టుంది... మా ఆడోల్లు వాగుపొంట ముంత పట్టుకపోయేటోల్లు కాదాయిరి....' అని వచ్చి చెప్పిండు.

పదారు గాజుల బాయి... అయిదు నూర్లకు ఎత్తిపోసుడు ఖరారైంది... ఉప్పు బొగ్గులు వాళ్లే తెచ్చుకోవాలె... యాభై రూపాయలు బయాన ఇచ్చిండు.

రమేషుగాడు గిట్ల చెయ్యవట్టె... గొర్రెమంకురు గాడు! లింగడు ఇంట్లనే తిరుక్కుంట ఏం చెయ్యిమంటవే... అని భార్యనడిగిండు.

"ఆడు మోరుదోపు పోరడు... ఆడు సెలవుల్లో మేనత్త ఇంటికి పోయినప్పుడు.... నువ్వు రెండు పాయికన్లు తోడేసినవని తెల్సినప్పుడే... చచ్చిపోతనన్నడు... ఎంత బతిలాడ్తి... ఎన్ని ఒట్లు పెట్టిచ్చుకున్నడు... నాకైతె దెల్వది... నీ ఇట్టం... నీ కొడుకిట్టం..." అన్నది ఎంకవ్వ.

"అదికాదే... ఎకేకీన అయిదునూర్లు ఎవడు బాకియ్యాలె... ఇచ్చినా ఎట్ల తీర్వాలె..." అన్నడు కండ్లు సిమ్మటిల్లినయ్... గొంతు బాధతోని జలుగురు పట్టినట్లయింది. "కైకిలి కూడా ఎవ్వలు పిల్తలేరు... ఏం పనులున్నయ్... వానలే లేకపాయె" బాధగా అన్నది ఎంకవ్వ.

"బతుకుపాడుగాను... రాశికి రాదాయె... రంగానికి రాదాయే. ఎప్పుడు ఎత్తుకోలు మొత్తుకోలేనాయె...." దుఃఖం బొొచ్చెల్నే ఆపుకుంట అన్నడు.

"మీ చెల్లెకు ఏం పెట్టి చెడిపోయినం... చేసుకోక చేసుకోక ఇంట్ల పండుగు చేసుకుంటంది. అయిదునూర్లన్న పెట్టకపోతే ఏం మంచిగుంటది అని అట్లనిపిస్తంది... ఇంట్లనేమో రూపాయి లేకపాయె..." కండ్లల్ల నీల్లురాంగ అన్నది ఎంకవ్వ.

"ఈ పోరడు గిట్ల జెయ్యవట్టె... ఇయ్యాల్ల కొత్తగ ఎత్తిపారవోత్తన్నమా... తాతల తండ్రుల కాన్నుంచి గిదే పనాయె... అదికూడా దొర్కుతలేదు. మ్యాతరోల్లంటే దొరలమా... బట్ట తడుపుకులపోల్లమా..." లింగడిలో కోపం, దుః ఖం కలగలిపి వస్తున్నయ్.

"అన్ని బల్లె పోరగాండ్లు ఛండాస్ ఎత్తిపారవోసెటోల్లని ముక్కు మూసుకొని దెప్పుతరట... అప్పుడైతే కండ్లల్ల సీకట్లచ్చి... సల్లజెముటలు పుట్టుకత్తయంటడు..." చెప్పింది ఎంకవ్వ.

"మరి తాత కొడుకేమన్న సూర్‌మాన్‌కాన్ అనుకుంటండా... బమ్మరాత బలిమిరాత అనుకోవాలె...." అన్నడు లింగడు.

"మరిప్పుడేం జేత్తవ్...?" అడిగింది ఎంకవ్వ

"అయిదునూర్లంటె ఎవలిత్తరు. చెట్టుకు కాత్తన్నయా... ఎట్లైతే అట్లైంది..." అనుకుంట లేసిండు... గడ్డపార, శీకులు తీసిండు.. పికాసి తట్టలు తీసిండు.

అప్పుడే రమేష్ ఇంటిదిక్కు ఉరికచ్చుడు చూసి ఎంకవ్వ పానం ఎల్లుకపోయింది. "పోరడు మాయిల్లమే ఉరికిరావట్టె... మల్లేమి లంపాట్కం చేత్తడోకదా" అని భయపడ్డది.

కొడుకును చూసి లింగడి పంచెడి పానాలు సల్లవడ్డయ్...

"ఏందిరా ఆగమాగం ఉరికత్తన్నవ్... బడి గిప్పుడే ఇడిసిపెట్టింండ్రా..." అనడిగిండు.

"సైకిలేది బిడ్డా..." అన్నది ఎంకవ్వ పికాసులు తలుపు సాటుకు జరిపి... వాడు ఆగి... ఎగపోసుకుంట మొసదీత్తండు...

వాడి మొకం వెలిగిపోతంది....

వాడి కండ్లనిండా కాంతులు...

పెదవుల మీద... చెంపలమీద నవ్వుల మరకలు...

"నాయిన్నా... జెల్ది రావే..." అన్నడు తండ్రి చెయ్యి పట్టుకొని. వాడు ఏడో తరగతి కామ్యాబ్ అయినప్పుడు గూడ అంత సంతోషంగా లేడు.

"ఎక్కడికిరా... చెంగలిత్తన్నవ్... బడికా" అన్నడు.

"లేదే... ఈశ్వరయ్య పటేలింటికి... జెప్పన రా..." అంటూ గుంజుక పోతండు. ఈశ్వరయ్య ఇంటికి అనంగనే లింగడు అయోమయంలో పడ్డడు. మొకం లేకుండ చేసిండా పోరడు అని అనుమానపడ్డడు...

కొడుకు వెంట నడిచిండు...

ఈశ్వరయ్య ఇల్లు దగ్గరికి రాంగనే...

"అటు చూడే నాయిన్నా... " అన్నడు లింగడు చూసిండు.

నీళ్ల ట్యాంకర్ కనవడ్డది. "అది నీల్లది కాదే నాయిన్నా... పాయికాన్లు ఎత్తిపారవోసేది. అగేంది... ఆ మోటర్ సప్పుడదే... దాన్ని వాక్యూమ్ లోడర్ అంటరే... పాయికాన్ల పైపు దించి మోటర్‌తోని ఆ ట్యాంక్‌లకు చండాస్‌ని ఎత్తిపోయిస్తరు..." లింగడి పానం అవిసిపోయింది. యాట పిల్లలెక్క బీరిపోయిండు.

అయిపోయింది... నోట్లె మన్నువడ్డది...

బాయిలు తోడుటానికి... బండలు కొట్టుటానికే గాదు... పాయికాన్లు తోడుటానికి గూడా ఇంజన్ మోటార్లచ్చినయ్...

లింగడి కన్నీల్లల్ల అయిదు వందల నోట్లు కొట్టుకపోతున్నయ్...

"అగేందే నాయిన్నా... ఆ ట్యాంకర్ మీద రాసింర్రు. హైమ సెప్టిక్ క్లీనర్స్... సెప్టిక్ ట్యాంకులు గాని, సిమెంట్ గాజుల లెట్రిన్‌లు గాని నిండిపోతే మాకు ఫోన్ చేయండి. అధునాతన పద్దతిలో శుభ్రం చేయగలం. మా ఫోన్ నెంబర్లు...

రమేష్‌గాడు చెప్పుకుంటూ పోతున్నడు...

అప్పుడే... ఈశ్వరయ్య పటేలు కనవడ్డడు.

"ఏంరా లింగా... ఎత్తిపోసుటానికి ఏడుసార్లు గుద్దసుట్టు తిప్పిచ్చుకుంటివి. దొడ్డుప్పు, బొగ్గులు ఏవి అక్కర్లేదు. ఇగో... పాయిఖాన్లు ఖాళీచేసే మోటార్లచ్చినయ్... గంటల ఖతం... రేపు యాభై రూపాయలు తెచ్చియ్యి..." ఈశ్వరయ్య కోపంగా అన్నడు.

లింగడు బాధగా... ఎనుకకు మర్లిండు...

"ఏంటిదే నాయిన్నా... గీ మోటార్లచ్చినందుకు నాకైతే సంతోషంగా వుందే" అన్నడు. "పాయికాన్లు ఎత్తిపారవోసుడు మనకేమన్నా ఖాయిషారా... బతుకు దెర్వుకోసం బిడ్డా... కనీ... దొంగ చీకటి ఒక్కటైతే ఏం చేస్తం బిడ్డా... ఎవనితోని కైలాట్కం పెట్టుకుంటం... లోకమంత తెల్లారెవరకు గారెడోడు మంత్రం చేసినట్టే కావట్టె... నోటికాడి బుక్క ఎవడు మాయం చేత్తండో అర్థంగాకపాయె..." అన్నడు బొండిగల దుఃఖం తాయిమాయి జేత్తుంటే....

రమేష్ తండ్రి చేతిని తన చేతిలోకి ఆప్యాయంగా తీసుకున్నడు...

పైసలు చేతిలపెట్టిండు... ఆ నోట్లు చూసి లింగడు ఆశ్చర్యపోయిండు...

"అయిదు వందలే నాయిన్నా... ఇయ్యాల్లనే బల్లె స్కాలర్‌షిప్ లిచ్చింద్రు... రుక్కత్తకు పెట్టు..." అని చెప్పి... స్కూల్ దిక్కు నడిచిండు....

లింగడి కళ్లు ఆనందంతో తడిసిపోయినయ్...

*